క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

కురవి: మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని రాసాల సింధూర కీర్తి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణచారి, పీడీ దార్ల సునీల్ సోమవారం తెలిపారు. విద్యార్థిని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో లత, శ్రీరాములు, సలీం, దీపిక, ఇందిర, వీరన్న, రజిత పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు..



కురవి: జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బి.బాబు, హెచ్‌డబ్ల్యూఓ ఎం.సునీత సోమవారం తెలిపారు. సీనియర్స్ విభాగంలో దివ్య, సబ్ జూనియర్స్ విభాగంలో స్వప్న, స్వాతి, దీపిక, సాయిమానస, హరిణి ఎంపిక కాగా వీరిని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో పీడీ అనిల్‌కుమార్, పీఈటీ సుశీల, ఉపాధ్యాయులు అమర్ సింగ్, రవి, మంగీలాల్, ధర్మ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సురుగు ఐలయ్య సామాజిక సేవకుడి అవార్డు స్వీకరించాడు. హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయగానసభలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

నూతన కార్యవర్గం ఎన్నిక



తొర్రూరు: ఉత్కంఠభరితంగా సోమవారం జరిగిన తొర్రూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో మచ్చ సురేష్ ప్యానల్ ఘన విజయం సాధించింది. సంఘం అధ్యక్షుడిగా మచ్చ సురేష్ తిరిగి ఎన్నికయ్యాడు. మూడు పదవుల్లో సురేష్ ప్యానల్ అభ్యర్థులే విజయం సాధించడం విశేషం. అధ్యక్షుడిగా మచ్చ సురేష్ తన సమీప అభ్యర్థి బిజ్జాల అశోక్‌పై 180ఓట్లతో విజయం సాధించాడు. ప్రధాన కార్యదర్శిగా తల్లాడి హీరాధర్, కోశాధికారిగా చిదురాల శ్రీనివాస్ గెలుపొందారు.

జిల్లా అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



డోర్నకల్: ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా డోర్నకల్‌కు చెందిన మంగు రాజ్‌కుమార్ నియమిస్తు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సందీప్ ఆదేశాలు జారీ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 1993–94 పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

మంత్రి జన్మదిన వేడుకలు



సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాన కార్యదర్శిగా వెంకట్



తొర్రూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన వైద్యాధికారి డాక్టర్ వెంకట్ సోమవారం ఎన్నికైయ్యాడు.

పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి

కురవి: పేదలు నిర్మించుకున్న గుడిసెలను క్రమబద్ధీకరించి పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రం శివారులో గుడిసె వాసులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, కుర్యాల వీరన్న పాల్గొన్నారు.

కారం ఘాటుకు చచ్చిపోతున్నాం..

- విద్య హెర్బల్ మిర్చి పరిశ్రమ వద్ద ప్రజల ఆందోళన



ఆందోళన చేస్తున్న పట్టణ ప్రజలు (ఫైల్)

మరిపెడ రూరల్: మిర్చి పరిశ్రమ నుంచి వెలువడే కారం ఘాటుకు దగ్గి దగ్గి ఊపిరాడక చచ్చి పోతున్నామని, తమ గోడును పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈమేరకు ఆదివారం రాత్రి మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని విద్య హెర్బల్ మిర్చి పరిశ్రమ వద్దకు పెద్ద ఎత్తున యువకులు, పట్టణ వాసులు కలిసి వచ్చి పరిశ్రమ గేటు వద్ద ఆందోళనకు దిగారు. మిర్చి ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న రసాయన, వాయు వ్యర్థాలతో నీరు, పీల్చే గాలి కలుషితమవుతోందని తెలిపారు. ఇళ్లలోని పిల్లలు, వృద్ధులు, అరోగ్య సమస్యలు ఉన్న వారు మిర్చి ఘాటుకు తాల లేకపోతున్నారని వాపోయారు. ఇప్పటికే కారం ఘాటుకు తట్టుకోలేక 40మంది మృతి చెందారని, ఇంకెంత మంది చనిపోవాలని వారు ప్రశ్నించారు. పరిశ్రమ నుంచి వెలువడే ఘాటు వాయువులు పట్టణ ప్రజల ఆరోగ్యంపై పెనుప్రభావం చూపుతుందన్నారు. 2021నుంచి ఈ ఫ్యాక్టరీ ద్వారా వచ్చే విష వాయువులతో అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి పరిశ్రమ నిర్వాహకులపై చర్య తీసుకోవడంతోపాటు వచ్చే ఘాటు వాయువుల నుంచి తమకు రక్షణ కల్పించాలని పట్టణ ప్రజలు వేడుకున్నారు.

నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు..



ఫ్యాక్టరీ నుంచి వెలువడే వాయు కాలుష్యంపై ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసిన మేరకు నిర్వాహకులకు కేవలం నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారే తప్పా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– గంట్ల మహిపాల్‌రెడ్డి, పట్టణ వాసి

ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న వీరయ్య

నెహ్రూసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు మినహా మరేమి అమలు కాలేదని పేర్కొన్నారు. దేవుళ్లపై ప్రమాణం చేసి రైతురుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. రైతు భరోసా వచ్చే ఖరీఫ్ నుంచి ఇస్తామని చెప్తున్నారని, హామీలను అమలు చేయకుంటే బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. సర్వేలు చేయించి ప్రభుత్వ భూములను వెలికి తీసి పేదలకు పంచాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో సోమవారం పీడీఎస్‌యూ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, విజయ్, సుష్మన్, రవి, మహేష్ పాల్గొన్నారు.

సీఏపై అధికారుల విచారణ

మరిపెడ రూరల్: మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన స్వాతిముత్యం సమైక్య సంఘం సీఏ ఎస్‌కే మెహర్నిసాపై ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం మరిపెడ మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో సీఏపై చేసిన ఆరోపణల మేరకు డీఆర్‌డీఏ డీపీఎం గడ్డం శ్రీనివాస్ విచారణ చేపట్టారు. దీంతో సీఏ అనుకూల, ప్రతికులవర్గాల వారు స్త్రీశక్తి భవనం వద్దకు చేరుకోగా ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్ సిబ్బందితో ఇరువర్గాల వారిని శాంతింపజేశాడు. అనంతరం విచారణను కొనసాగించారు. నివేదికను డీఆర్‌డీఏ ఉన్నత అధికారులు అందించనున్నట్లు డీపీఎం శ్రీనివాస్ తెలిపాడు.

రికార్డుల పరిశీలన

దంతాలపల్లి: గ్రామపంచాయతీ కార్యాలయాలలో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని మండల పంచాయతీ అధికారి అప్సర్ పాషా అన్నారు. మండలంలోని గున్నెపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ రికార్డులను సోమవారం ఆయన పరిశీలించారు.

నల్లబ్యాడ్జీలతో ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

నెహ్రూసెంటర్: ఎల్‌ఐసీ ఏజెంట్ల కమీషన్ తగ్గింపు చర్యలు మానుకుని పాత పద్ధతిలోనే కమీషన్ కొనసాగించాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐఏఎఫ్‌ఐ) మహబూబాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు బానోత్ రాంచందర్, కార్యదర్శి సాదు మహిపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట సోమవారం నల్లబ్యాడ్జీలను ధరించి ధర్నా నిర్వహించారు. కమీషన్ తగ్గింపు పద్ధతి ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న 23లక్షల ఏజెంట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెర్నం శ్రీరాములు, శ్రీనివాసచారి, వెంకటేశ్వర్లు, సురేందర్, కష్ణ, యాదగిరి, రాజవర్ధన్‌రెడ్డి, కలీం పాల్గొన్నారు.

సంస్మరణ సభలు జయప్రదం చేయండి



నెహ్రూసెంటర్: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: నవంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే అమరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న, జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సంస్మరణ సభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భట్టు చైతన్య, సామ పాపయ్య, బోనగిరి మధు, తెల్లబోయిన లక్ష్మయ్య, పర్వత కోటేష్, కృష్ణ, విజయ్, శ్యామ్, సుష్మంత్ పాల్గొన్నారు.

సభ కరపత్రాల ఆవిష్కరణ

గూడూరు: సాయుధ ప్రతిఘటన పోరాటంలో అమరులైన వీరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పనిచేయాలని ఎన్డీ జిల్లా నాయకుడు గజ్జి లింగన్న పిలుపునిచ్చారు. నవంబర్ 3న మచ్చర్లలో జరిగే సూరి యాకన్న స్మారక సభ కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అచ్చన్న, నర్సయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాలలో సోమవారం ఎస్పీ ఆదేశాల మేరకు షీటీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా ఈవ్ టీజింగ్ గురైనప్పుడు, ఆన్‌లైన్‌లో మోసపోయినప్పుడు, అపరిచిత వ్యక్తుల పట్ల, బెదిరింపులకు భయపడకుండా వెంటనే డయల్ 100, 87126 56935, 79011 42009 నంబర్లను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసుల్లా, భరోసా కోఆర్డినేటర్ జ్యోత్స్న, జయశ్రీ, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కేసముద్రం: రైలు నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంటికన్నె– నెక్కొండ రైల్వేస్టేషన్‌ల మధ్య అప్, డౌన్ లైన్ 416/17–19 కిలోమీటర్ వద్ద గుర్తు తెలియని రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి, ఫుట్‌డోర్ నుంచి జారిపడ్డాడు. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు 50 నుంచి 55 సంవత్సరాల వయసు, బ్లూ కలర్ జీన్స్ పాయింట్, బ్లూ, రెడ్ కలర్ చెక్స్ ఫుల్‌షర్టు, తెలుపు రంగు బనియన్‌ను ధరించి ఉన్నాడని, ఎత్తు 5.7, ఎరుపు రంగు, కోల ముఖం కలిగి ఉన్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఒకరు..

డోర్నకల్: కొద్ది రోజుల క్రితం అగ్ని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. తొడేళ్లగూడెం గ్రామానికి చెందిన గాలి కేశవులు(61) గ్రామంలో తోపుడుబండిపై టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. ఈనెల 10న టిఫిన్ సెంటర్‌లో స్టౌ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో కేశవులు గాయపడటంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో పొడుచుకున్న వ్యక్తి..

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామ శివారు స్టేషన్‌తండాలో మద్యం మత్తులో కత్తి, బీరుసీసా, ఇనుపచువ్వతో పొట్టలో, తలపై పొడుచుకున్న ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అస్సాం రాష్ట్రం శివ్‌సాగర్ జిల్లా అమ్‌గూరితెహ్‌సిల్ గ్రామానికి చెందిన దుక్కుగర్హ్(22) అనే యువకుడు, ఈనెల 25న ఇంటికన్నె గ్రామ శివారు స్టేషన్‌తండాలో పొడుచుకుని తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ మేరకు అతడిని మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమణ

నెహ్రూసెంటర్: గీత కార్మికుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత సొసైటీలకు పది ఎకరాల భూమి కేటాయించాలని, మృతిచెందిన గీత కార్మికులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రతి జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం నీరా కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 29న జిల్లాస్థాయి సదస్సును సీరోలు మండలంలో నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న తెలిపారు. ఈ సమావేశంలో గునిగంటి మోహన్, మోడెం వెంకటేశ్వర్లు, పానుగంటి వీరస్వామి, బబ్బూరి ఉప్పలయ్య, గుదే వెంకన్న, బొమ్మరి శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్

మరిపెడ రూరల్: జనాభాలో 42శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్ గౌడ్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కుమ్మరి సంఘం కార్యాలయంలో బీసీ రాజ్యాధికార సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. బహుజన జాతులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకకు నెట్టివేయబడ్డారని అన్నారు. అనంతరం బీసీ రాజ్యాధికారి సమితి మరిపెడ పట్టణ అధ్యక్షుడిగా అలువాల ఉమేష్‌చందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముంజల రాజేందర్, కృష్ణయ్య, హరికృష్ణ, ముస్తఫా, శ్రావణ్, సాయికుమార్, సాయి, రమేశ్, వెంకటేశ్వర్లు, వంశీ పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకాలకు లైసెన్స్ తప్పనిసరి

గూడూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దీపావళి సందర్భంగా విక్రయించే టపాసులకు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేనిచో చర్యలు తప్పవని సీఐ కె. బాబూరావు అన్నారు. మండల కేంద్రంలోని రాంలీలా మైదానంలో బాణసంచా విక్రయదారులు ఏర్పాటు చేసుకుంటున్న షాపుల ఏర్పాటును సోమవారం సీఐ, ఎస్సై పరిశీలించారు. సొంత గృహాల వద్ద అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం వస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కురవి: పోలీస్‌స్టేషన్ పరిధిలో బాణసంచా అమ్మే దుకాణదారులు విధిగా అనుమతి తీసుకోవాలని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. సోమవారం పలు దుకాణదారులతో సమావేశం నిర్వహించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: దీపావళి సందర్భంగా టపాసులు అమ్మే షాపుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య సోమవారం తెలిపారు. మహబూబాబాద్ రూరల్ మండల ప్రజలు పండుగ సెలవుల్లో ఊరికి వెళ్లే వారు ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, డబ్బు ఉంచకుండా బ్యాంకులు, లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఊరికి వెళ్లే ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

‘మా ఇంటి మహాలక్ష్మి’



ఐదు రూపాయల కాయిన్స్‌తో చిన్నారి అలంకరణ

నెహ్రూసెంటర్: ఆడపిల్ల పుట్టడంతో ఆ ఇంట్లో లక్ష్మీదేవిగా భావిస్తూ వినూత్న వేడుకకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీకి చెందిన ప్రశాంత్ వర్ష దంపతులకు తొలి సంతానంగా ఆడపిల్ల జన్మించింది. తమ ఇంట లక్ష్మీదేవి జన్మించిందని రూ.5కాయిన్స్ (రూ.25వేలు)తో అలంకరించి మొదటి నెల వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి కనుల పండువగా జరుపుకున్నారు.

సంక్షిప్త సమాచారం

రైతులు జాగ్రత్తలు పాటించాలి

గూడూరు: రైతులు తమ పంట పొలాల్లో విద్యుత్ కనెక్షన్‌లపై తగు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ఏడీఈ కవిత అన్నారు. మండలంలోని గుండెంగలో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ‘పొలంబాట’ నిర్వహించారు.

పెండింగ్ డీఏ ప్రకటించాలి

కురవి: ఉపాధ్యాయులకు రావాల్సిన మొత్తం పెండింగ్ డీఏలను ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎల్లయ్య, బాబు, గోపాల్‌రావు, సింధు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గూడూరు: మండలంలోని మచ్చర్లకు చెందిన చెన్నబోయిన రాంబాబు ఇటీవల గుండెనొప్పితో మృతిచెందాడు. ఈవిషయం తెల్సుకున్న మృతుడి బాల్యమిత్రులు సోమవారం రూ.10వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాస్, రవీందర్, రామన్న, వెంకన్న, రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



గార్ల: మండలంలోని పుల్లూరు పంచాయతీ బంగ్లాతండాకు చెందిన శతాధిక వృద్ధురాలు బోడా పింప్లీ (101) ఆదివారం రాత్రి మృతిచెందారు. మృతురాలికి నలుగురు కుమారులు సంతానం. మృతురాలు పింప్లీ, ఆమె భర్త తావుర్య కలిసి రజాకార్లతో పోరాడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

పంటకు బోనస్ ఇవ్వాలి

నెల్లికుదురు: రైతులు పండించిన పంటకు బోనస్ ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ఆర్‌ఐ పాషాకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, యాకయ్య, వెంకన్న, రమేశ్, కేశవులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు ప్రదానం



మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో హోం స్వచ్ఛంద సేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో సోమవారం వన, ప్రకృతి ప్రేమికుడు దైద వెంకన్నకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ అవార్డు పురస్కారం అందజేసి సన్మానించారు.

పాఠశాల తనిఖీ

కేసముద్రం: మండలంలోని బేరువాడ గ్రామంలో గల యూపీఎస్, నర్సింహులగూడెం, వాక్యాతండా పీఎస్‌లను ఎంఈఓ కాలేరు యాదగిరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు.

చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా..

గార్ల: గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ కిరణ్ తన స్వగ్రామమైన పినిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నాడు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. సోమవారం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు శ్రీనివాసరావు, మండల కార్యదర్శి సత్యవతి, పెద్దవెంకటేశ్వర్లు, నాగమణి పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించాలి

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలో సీసీఐ కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు బొబ్బాల యాకుబ్ రెడ్డి, గొడిశాల వెంకన్న ఆధ్వర్యంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మర్తనేని పాపారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

గూడూరు: మండలంలోని బొల్లెపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అర్రెం రాములు (80) సోమవారం మృతిచెందాడు. విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు ఆయన కుటుంబాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

కేసముద్రం: డీఏ, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో టీపీయూస్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం పాల్గొన్నారు.

పేదలకు వరం ‘సీఎంఆర్‌ఎఫ్’

కురవి: సీఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరంలాంటిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు రాజేందర్‌కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

గార్ల: విధులపై అంకితభావంతో పనిచేసే ఉద్యోగికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఐపీఓ వై.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని ముల్కనూరు బ్రాంచి పోస్టుమాస్టర్ మలినేని ఉదయ్‌కుమార్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఆత్మీయ వీడ్కోలు సన్మానం

నెల్లికుదురు: విద్యార్థులకు గురువే దైవం అన్న మాటకు నిదర్శనం ఉపాధ్యాయుడు లింగమూర్తి అని ఎంఈఓ రాందాస్, కాంప్లెక్స్ హెచ్‌ఎం స్వప్న అన్నారు. మండలంలోని జామతండాలో పనిచేసి బదిలీపై వెళ్లిన డీఎస్‌టీ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయుడు లింగమూర్తి, పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి వెళ్లిన అశోక్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంగమ్మ, మౌనిక శ్రీనివాస్, కార్యదర్శి శోభ, సోమన్న, సురేష్, రమేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ అందజేత



తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగులకు వీల్‌చైర్, నగదును జర్మనీలో నివాసం ఉండే దాత కిశోర్ సోమవారం అందించి చేయూనిచ్చారు. గ్రామానికి చెందిన రాంమూర్తి, రజిత దంపతులకు ఇద్దరు కుమారులు అరుణ్, అరవింద్‌లు పుట్టుకలోనే దివ్యాంగులుగా జన్మించారు. కురవి మండలానికి చెందిన రఘు అనే యువకుడు స్పందించి జర్మనీలో ఉండే తన స్నేహితుడు కిశోర్‌కు సమాచారం అందించి చేయూతను ఇచ్చేవిధంగా కృషి చేయడంతోపాటు స్వయంగా వచ్చి దివ్యాంగులకు వీల్‌చైర్ అందించాడు. కార్యక్రమంలో యాకన్న, సురేష్, అనిల్, రాజేష్, గౌస్, వెంకీ పాల్గొన్నారు.

8క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు

మరిపెడ రూరల్: అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ నిషేధిత 8క్వింటాళ్ల నల్లబెల్లం, 60 కిలోల పటికను పట్టుకున్నట్లు మరిపెడ ఎస్సై సతీష్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తానంచర్ల శివారులో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అశోక లే ల్యాండ్ ట్రాలీ, అప్పి ట్రాలీ రెండు వాహనాల్లో 8క్వింటాళ్ల నల్లబెల్లం, 60 కిలోల పటిక తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి, బెల్లం తరలిస్తున్న సూర్యాపేట జిల్లా పెద్దనేమిల గ్రామానికి చెందిన ఐతరాజు ఉప్పలయ్య, బోలక నాగన్న, మరిపెడ మండలం కోట్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలో జాల్ తండాకు చెందిన మాలోతు సైదుల అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.